



ప్రథమ స్థానం సాధించిన పాఠశాల విద్యాశాఖ శకటం

మురిసిన మువ్వన్నెల జెండా

- ఘనంగా గణతంత్ర వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన జాగిలాలు, శకటాల ప్రదర్శన
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు





జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి



పార్వతీపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణతంత్ర సంబరాలు అంబరాన్నంటాయి. మువ్వన్నెల జెండా మురిసింది. ప్రతి మదిలో దేశభక్తి ఉప్పొంగింది. ఆదివారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన ప్రత్యేక వాహనంలో పరేడ్‌ను తిలకించి పోలీస్ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలో పోలీస్ దళం జాతీయ గీతాన్ని ఆలపించింది. ఆ తర్వాత వారు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. పోలీస్ రక్షక దళాలు, సీఆర్‌పీఎఫ్, ఎన్‌సీసీ క్యాడెట్లు, హోమ్‌గార్డులు తమ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. మరోవైపు శకటాల ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది.

(పూర్తి వివరాలు నాలుగో పేజీలో)



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో పార్వతీపురం పాఠశాలల విద్యార్థినులు



బద్దుమాసింగి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఇలా..



థింసా నృత్యం చేస్తున్న భామిని కేజీబీవీ విద్యార్థినులు

గిరి బిడ్డలకు అందుబాటులో విద్య

- అన్ని హంగులతో హాస్టళ్ల నిర్మాణానికి రంగం సిద్ధం
- వసతి, భోజన సౌకర్యం కల్పనకు చర్యలు
- పీఎం జన్‌మన్‌లో నిధులు మంజూరు

సీతంపేట రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో మారుమూల గిరిశిఖర ప్రాంతాల్లో పీవీటీజీ హాస్టల్స్ నిర్మాణాలకు రంగం సిద్ధమైంది. దీంతో గిరిజన బిడ్డలకు ఇకపై స్థానికంగానే మెరుగైన విద్య, నాణ్యమైన పౌష్టికాహారం అందనుంది. ఏజెన్సీలో రెండు ప్రాంతాల్లోని పాఠశాలల్లో మొదటి విడతగా హాస్టల్స్ నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలోని మందస మండలం కిల్లోయి ఎంపీయూపీ పాఠశాలలో రూ.230లక్షలతో హాస్టల్ భవన నిర్మాణం ప్రారంభమైంది. సీతంపేట మన్యంలో గుడ్డిమీదగూడ జీపీఎస్ పాఠశాల, జలుబుగూడ ఎంపీపీఎస్ పాఠశాలల్లో నిర్మాణాలు చేపట్టనున్నారు. వాటి కోసం పీఎం జన్‌మన్ (ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ నయాయ మహా అభియాన్) పథకం కింద నిధులు మంజూర య్యాయి. రెండో విడతలో కుడ్డపల్లి జీపీఎస్ పాఠశాలలో పీవీటీజీ హాస్టల్ నిర్మించనున్నారు. ఆయా పాఠశాలల పరిధిలో ఉన్న గిరిజన బిడ్డలను గుర్తించి ఒక్కో హాస్టల్‌లో 50మందిని ఉంచనున్నారు. ఈ బాధ్యతను సంబంధిత ఎంఈవోలకు ప్రభుత్వం అప్పగించింది. ఎస్ఎస్ఏ(సమగ్ర శిక్ష అభియాన్)ఆధ్వర్యంలో ఈ హాస్టల్స్ నిర్వహణ చేపడతారు. ఇందుకోసం ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించనున్నారు. ఒక్కో హాస్టల్‌లో 50 మంది ఆదివాసీ చిన్నారులకు వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారు. అదే గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులు చదువుకుని హాస్టల్స్‌లో ఉండాలి. ఉదయం హాస్టల్‌లో అల్పాహారం, మధ్యాహ్నం పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అందిస్తారు.

● డ్రాపౌట్ల నివారణకు అవకాశం

పాఠశాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత తదితర కారణాలతో పీవీటీజీ చిన్నారులు డ్రాపౌట్లుగా మారి ఇంటికే పరిమితమవుతున్నారు. ఏటా సీతంపేట మన్యంలో వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. డ్రాపౌట్లుగా మారుతున్న చిన్నారులు పశువుల కాపరులుగా, కూలీలుగా మారుతున్నారు. అయితే పీవీటీజీ హాస్టల్స్ నిర్మాణం పూర్తయితే ఏజెన్సీలో డ్రాపౌట్ల సంఖ్య తగ్గనుంది. దీనిపై ఎంఈవో ఆనందరావు మాట్లాడుతూ.. త్వరలోనే పీవీటీజీ హాస్టళ్ల ప్రారంభమవుతాయని తెలిపారు. గిరిజన చిన్నారులకు ప్రాథమిక దశ నుంచే మెరుగైన విద్య , నాణ్యమైన పౌష్టికాహారం అందుతుందన్నారు.



పీవీటీజీ హాస్టల్ నిర్మించనున్న జలుబుగూడ గ్రామం

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి
● మంత్రి సంధ్యారాణి 6లో

గిరిజన రైతులకు రూ.10లక్షల స్పింక్లర్ యూనిట్లు 6లో

కూటమి ప్రభుత్వంలోనే పరిశ్రమలు
● నేడు కురుపాంలో జాబ్‌మేళా ● ప్రభుత్వ విప్ జగదీశ్వరి

నేటి నుంచి శంబరం

- తొలేళ్లకు ఏర్పాట్లు పూర్తి
- రేపు సిరిమానోత్సవం
- మొదలైన సందడి
- భారీగా తరలిరానున్న భక్తులు



చదురుగుడిలో శంబర పోలమాంబ

సాలూరు రూరల్/మక్కువ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ జాతరలో తొలి అంకమైన తొలేళ్ల ఉత్సవానికి సర్వం సిద్ధమైంది. సోమవారం సంప్రదాయబద్ధంగా ఈ వేడుకను నిర్వహించనున్నారు. ఈ నెల 28న మంగళవారం సిరిమానోత్సవం, 29న బుధవారం అంపకోత్సవం జరగనుంది. పోలమాంబ జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. అయితే ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా, అమ్మవారి దర్శనం త్వరగా అయ్యేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయ పరిసరాల్లో క్యూలైన్లు, మరుగుదొడ్లు తదితర వాటిని సిద్ధం చేశారు. ఇదిలా ఉండగా సాలూరు మండలం కందులపథం పొలిమేర వద్ద గుర్తించిన సిరిమాను ఏరువాక ద్వారా గ్రామంలోకి తీసుకొచ్చారు. దానిని సిరిమానుగా సోమవారం తయారు చేయనున్నారు. మొత్తంగా శంబరలో సందడి మొదలైంది.

డ్రోన్స్, బాడీ వేర్ కెమెరాలతో నిఘా

ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో జాతరలో ప్రత్యేకంగా బాడీవేర్ కెమెరాలతో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సిరిమానోత్సవం రోజున ఆరు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. ముగ్గురు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 48 మంది ఎస్ఐలు, మరో నలుగురు మహిళా ఎస్ఐలు , 116 మంది ఏఎస్ఐలు,హెచ్‌సీలు, 282 మంది కానిస్టేబుళ్లు, మరో 56 మంది మహిళా కానిస్టేబుళ్లు, 138 మంది హోంగార్డులతో భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. శంబర భద్రత ఏర్పాట్లను సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రోడ్డు క్లియరెన్స్ పార్టీలను ఏర్పాటు చేశారు.

40 వేల లడ్డూలు సిద్ధం

జాతరకు వచ్చే భక్తుల కోసం 40 వేల లడ్డూ ప్రసాదం సిద్ధం చేసినట్టు ఈవో వీవీ సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందుల్లేకుండా జాతర ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. పది వారాల పాటు జాతర నిర్వహించనున్నామన్నారు.

ప్రత్యేక బస్సులు

పార్వతీపురం టౌన్: శంబర జాతరకు 130 బస్సులు నడుపుతున్నట్లు పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గాదేవి తెలిపారు. ఆదివారం స్థానిక డిపో కార్యాలయంలో మాట్లాడుతూ... సోమవారం తొలేళ్ల సందర్భంగా పార్వతీపురం డిపో నుంచి శంబరకు 5, సాలూరు నుంచి 10 బస్సులు నడుపుతున్నామన్నారు. 28న సిరిమానోత్సవం రోజున పార్వతీపురం నుంచి 25, సాలూరు నుంచి 25, పాలకొండ నుంచి 10, ఎస్.కోట నుంచి 10, విజయనగరం డిపో నుంచి 20, శ్రీకాకుళం-2 డిపోకు చెందిన 10 బస్సులను బొబ్బిలి నుంచి జాతరకు వెళ్లనున్నట్లు చెప్పారు. 29న బుధవారం పార్వతీపురం డిపో నుంచి 5, సాలూరు డిపో నుంచి 5 బస్సులు, పాలకొండ, విజయనగరం, ఎస్.కోట, శ్రీకాకుళం-2 డిపోల నుంచి బస్సులను శంబరకు నడపనున్నట్లు వెల్లడించారు.

జాతర నిర్వహణ ఇలా..

ఏటా ధనుర్మాసం ప్రారంభం రోజున పెదపోలమాంబ జాతర ప్రకటిస్తారు. వారం రోజులు ఘటాలను శంబరలో ఉంచి పూజలు చేశారు. పెదపోలమాంబ అంపకోత్సవం రోజున పోలమాంబను గ్రామంలోకి తెచ్చి పూజలు నిర్వహిస్తారు. పోలమాంబ అంపకోత్సవం ముందు రోజు సిరిమానోత్సవం నిర్వహిస్తారు. ఏటా ఈ సిరిమానోత్సవానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతునే ఉంది. గతంలో ఒక్క వారమే జాతర జరిగేది. ప్రస్తుతం పది వారాల వరకు అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు.

పోతికోడెరాళ్లుగా..

పోలమాంబ పోతికోడె రాళ్లుగా సైతం పూజలందుకుంటుంది. గ్రామానికి సమీపాన ఉన్న గుడాం కొండపై చెరువు చదునుకు ప్రతి ఇంటి నుంచి ఏరు (అరక) తీసుకు రావాలని జమిందారు ఆజ్ఞాపించారు. పేకాపు అప్పన్న దొర కుటుంబీకులు ఎద్దులు లేకపోవడంతో చింతించారు. వారికి కలలో అమ్మవారు కనబడి ఎద్దులుగా తాను, మేనత్త పెద పోలమాంబ వస్తామని అరక పూయండని చెప్పింది. ఉదయం లేచి చూడగా పెరటిలో రెండు ఎద్దులు ఉన్నాయి. వాటితో అరకను తీసుకెళ్లగా చూసే వారికి పులులతో పాటు పాము వస్తున్నట్టు కనిపించడంతో రైతులు పరుగులు తీశారు. ఆ తర్వాత పోలమాంబ, పెదపోలమాంబలు కొండపై పోతి కోడెరాళ్లుగా మారారు. ఇప్పటికీ పోతికోడెరాళ్లకు పూజలు చేసి సేద్యపు పనులు ప్రారంభిస్తారు.

పోలమాంబ నేపథ్యం

గిరిజన కొండదొర పేకాపు అప్పన్నదొర దంపతులకు పోలమాంబ (పోలేశ్వరి) జన్మించింది. ఆమె ఎవరి కంట పడకుండా ఇంట్లో ఉండేది. యుక్త వయసు రాగానే మామిడిపల్లికి చెందిన యువకునితో పాణిగ్రహణం జరిపించారు. పోలమాంబ భర్త గుర్రంపై, మేనత్త పెదపోలమాంబ తోడు పోలమాంబ సవారిపై అత్తారింటికి వెళ్తుండగా.. గోముఖీ నది దాటిన తరువాత పోలమాంబ సవారిని ఆపమని చెప్పింది. సమీపంలో చెట్ల మధ్యకు వెళ్లింది. ఆమె ఎంతకీ రాకపోవడంతో మేనత్త పెద్ద పోలమాంబ వెళ్లింది. ఆ సమయంలో పోలమాంబ భూ ప్రవేశం చేస్తుండడం చూసింది. దీంతో తాను కూడా వస్తానని చెప్పడంతో ఆమెను సైతం పోలమాంబ తనతో భూ ప్రవేశానికి అనుమతిచ్చింది. అనంతరం పోలమాంబ, పెదపోలమాంబ పూజించడం ఆరంభమైంది. నాలుగు వందల ఏళ్ల నుంచి సంక్రాంతి తరువాత జాతర నిర్వహించడం సంప్రదాయంగా మారింది. చెముడు జమీందారు మాన్యాలిచ్చారు. ఆలయం దేవదాయశాఖ పరిధిలోకి రాకముందు భక్తులు సైతం పెద్దమొత్తంలో భూములిచ్చారు. ఈ మాన్యాలు కొన్ని అక్రమార్కుల స్వాధీనంలో ఉన్నట్లు విమర్శలున్నాయి.



సిద్ధమైన లడ్డూ ప్రసాదం



ఆలయ పరిసరాల్లో క్యూలైన్లు ఇలా..

అమ్మవారికి రెండు గుడులు

శంబర పోలమాంబకు గోముఖీ తీరంలో తూర్పు, పశ్చిమ తీరాన రెండు గుడులు ఉండడం విశేషం. ఈ రెండు గుడుల్లో అమ్మవారికి భక్తులు పూజలు చేస్తారు. తొలుత పోలమాంబకు ఎటువంటి ఆలయం లేకుండా గ్రామంలో ఘటాలకు, వనం గుడి వద్ద ఆమె భూ ప్రవేశం చేసిన ఉన్న చెట్టుకు భక్తులు పూజలు చేసేవారు. ఆమెకు గుడి నిర్మిస్తే ఏమవుతుందోననే భయంతో కట్టలేదు. జాతర మాత్రం ఏటా కొనసాగుతూనే ఉంది. పోలమాంబ భూ ప్రవేశం చేసిన చోట 38 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన గ్రంధి సింహాచలం , పలువురు గ్రామస్థుల సహకారంతో గుడిని నిర్మించారు. గ్రామంలో ఘటాలు ఉంచే పాకలో సైతం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గుడి, విగ్రహం ఏర్పాటు చేశారు. దీంతో అమ్మవారికి రెండు గుడుల్లో పూజలు జరుగుతున్నాయి.



సిరిమాను చెట్టును గ్రామానికి తెచ్చిన దృశ్యం





కలెక్టర్ అంబేడ్కర్‌కు సెల్యూట్ చేస్తున్న పోలీసు జాగిలం



గణతంత్ర సంబరాలు

- విజయనగరంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆకట్టుకున్న ప్రభుత్వ శాఖల శకటాలు



గణతంత్ర దినోత్సవాలను చిత్రీకరిస్తున్న డ్రోన్ కెమెరా





పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్,



వేడుకలను తిలకిస్తున్న జిల్లా న్యాయాధికారి కల్యాణ చక్రవర్తి, మంత్రి శ్రీనివాస్



విద్యాశాఖ శకటం (ప్రథమ బహుమతి)



వైద్య ఆరోగ్యశాఖ శకటం (ప్రథమ బహుమతి)



ఐసీడీఎస్ శకటం (ప్రథమ బహుమతి)



విద్యుత్ శాఖ శకటం (ద్వితీయ బహుమతి)



ఉద్యానవన శాఖ శకటం (తృతీయ బహుమతి)



మత్స్యశాఖ స్టాల్‌లో చేపలను పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం కలెక్టరేట్/ దాసన్నపేట/ రింగురోడ్డు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో భాగంగా స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపిస్తూ.. నృత్యాలతో అలరించారు. నెల్లిమర్ల మండలం కొండవెలగాడ పాఠశాల విద్యార్థులు 'భరత ఖండమే నా దేశం' అనే గీతాన్ని ఆలపిస్తూ నృత్యం చేశారు. విజయనగరం కేజీబీవీ చిన్నారులు 'నమో నమో కేథారనాథ్ బోల్‌నాథ శంకర్' అనే గీతాన్ని ఆలపించారు. నెల్లిమర్ల మహాత్మగాంధీ జ్యోతిరావు పూలే విద్యార్థులు 'జగతి సిగలో జాబిలమ్మ' అంటూ నృత్యం చేశారు. చీపురుపల్లి, రాజాం బాలభవన్ విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. వేపాడ, కొత్తవలస, నెల్లిమర్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు నృత్యం చేశారు. కొత్తవలస జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు థింసా నృత్యాన్ని ప్రదర్శించారు.

శకటాల ప్రదర్శన..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి శకటాల ప్రదర్శనను స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ), గృహ నిర్మాణం, పరిశ్రమలు, పర్యాటకం, విద్యా శాఖ, వైద్యం, శిశు సంక్షేమ శాఖ, క్రీడలు, కాలుష్య నియంత్రణ మండలి, జలవనరులు, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం, వ్యవసాయం, మత్స్య, డ్వామా, విద్యుత్, ఉద్యానవన శాఖలతో పాటు సెంచూరియన్ విశ్వవిద్యాలయం హెల్త్ కేర్‌పై శకటాలను ప్రదర్శించాయి. ఇవి అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీటికి బహుమతులు అందించారు.





అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది ప్రయోగం

అభివృద్ధి, సంక్షేమమే.. లక్ష్యం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- పార్వతీపురంలో ఘనంగా గణతంత్ర వేడుకలు



పోలీసు జాగిలం విన్యాసం

పార్వతీపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ తర్వాత ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో ఎన్నో అంశాల్లో ప్రగతి సాధించామన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేశామన్నారు. అన్ని వర్గాలకూ సముచిత స్థానం కల్పించామని వివరించారు. బలహీన వర్గాలు, మహిళలకు అండగా నిలిచినట్లు చెప్పారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్య క్రమాలు, అమలవుతున్న సంక్షేమ పథకాల ప్రగతిని తెలియజేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 487 మంది అధికారులు, సిబ్బందికి కలెక్టర్ పురస్కారాలు అందించారు.

ప్రత్యేక ఆకర్షణగా డాగ్‌షో...

రిపబ్లిక్ డే వేడుకల్లో డాగ్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బిందు, లైకా, శాండీ పేరు గల పోలీస్ జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ముందుగా బిందు, లైకాలు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డిలకు పుష్పగుచ్ఛాలను అందజేసి సెల్యూట్ చేశాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో పార్వతీపురం పాఠశాల విద్యార్థినులు శాస్త్రీయ నృత్యంతో ఆకట్టుకున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధి బడ్డ మాసింగి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు 'రింగ్ రింగ్ నరేన' గీతానికి నృత్యం చేశారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన



జీఎల్‌పురం కేజీబీవీ విద్యార్థినుల పిరమిడ్ విన్యాసం

జయహో అంటూ సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు తమ నృత్యంతో ఆలోచింపజేశారు. భామిని కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించిన థింసా నృత్యం అలరించింది. గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ విద్యార్థినులు పిరమిడ్ విన్యాసాలతో అబ్బురపరిచారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీ దిలీప్ కిరణ్, జేసీ శోభిక తదితరులు వారిని అభినందించి బహుమతులు అందజేశారు.

శకటాల ప్రదర్శన

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, యంత్రాంగం సాధించిన ప్రగతి అంశాలను తెలుపుతూ సాగిన శకటాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసిన శకటం ప్రథమ స్థానంలో నిలిచింది. పంచాయతీ రాజ్, జల వనరులు, ఆర్‌అండ్‌బీ, గ్రామీణ నీటి సరఫరా విభాగాల శకటం ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. విద్యుత్ శాఖ శకటం తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. సంబంధిత అధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో హేమలత, కేఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు వై.సత్యంనాయుడు, రామచంద్రరావు, డీఐపీఆర్‌వో ఎల్.రమేష్, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి టి.కనకదుర్గ, వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, డీఎంహెచ్‌వో భాస్కరరావు, డీఈవో తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ద్వితీయ స్థానం సాధించిన పీఆర్, జలవనరుల శాఖ శకటం



తృతీయ స్థానంలో నిలిచిన విద్యుత్ శాఖ శకటం

● అధికారులకు అవార్డులు అందజేసిన కలెక్టర్ అంబేడ్కర్

ఉత్తమ సేవకులకు గుర్తింపు

విజయనగరం కలెక్టరేట్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉత్తమ సేవలు అందించిన అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థలకు గణతంత్ర వేడుకల్లో భాగంగా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ అంబేడ్కర్ ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్, ఎస్పీ వకుల్ జిందాల్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో కీర్తి తదితరులున్నారు.



ప్రమీలాగాంధీ డిప్యూటీ కలెక్టర్ | జోషఫ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ | సత్యవాణి ఆర్డీవో, చీపురుపల్లి | రామ్మోహనరావు ఆర్డీవో, బొబ్బిలి | కీర్తి ఆర్డీవో, విజయనగరం | సౌమ్యలత ఏఎస్పీ | శ్రీనివాసమూర్తి డీఆర్వో



జేసీ సేతు మాధవన్‌కు అవార్డును అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ



సుధారాణి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ | రామారావు జేడీ, వ్యవసాయశాఖ | వై.వి.రమణ జేడీ, పశు సంవర్ధకశాఖ | ఎం.లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్ | మధుసూధనరావు డీఎస్‌వో | మీనాకుమారి, డీఎం సివిల్ సప్లయిస్ | కల్యాణచక్రవర్తి, పీడీ డీఆర్‌డీఏ | రమేశ్ డీపీఆర్వో | వెంకటేశ్వరరావు డీఎస్‌డీవో | రామ్‌ప్రకాశ్ జిల్లా అగ్నిమాపక సేవాధికారి | వీవీఆర్ మూర్తి ఎల్‌డీఎం



రవికిరణ్, ఏడీ మార్కెటింగ్‌శాఖ | పి.నల్లనయ్య మున్సిపల్ కమిషనర్ | రామలక్ష్మి కమిషనర్, బొబ్బిలి | రామప్పలనాయుడు కమిషనర్, రాజాం | ఆర్ఎస్ జాన్ ఈడీ, మైనార్టీ ఫైనాన్స్ | శ్రీనివాస్, ఎస్ఈ పంచాయతీరాజ్ | బాలాజీ సీపీవో | కాంతిమతి ఎస్ఈ, ఆర్అండ్‌బీ | రామానందం డీడీ, సోషల్ వెల్ఫేర్ | మణికుమార్ ఉప రవాణా కమిషనర్ | సత్యనారాయణ సీఈవో, జడ్పీ

● అధికారులకు ప్రశంసాపత్రాలు, అవార్డుల అందజేసిన శ్యామ్‌ప్రసాద్

ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు

పార్వతీపురం: వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సేవకులకు, అధికారులకు సిబ్బందికి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రతిభా పురస్కారాలను అందించారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 487 మంది అధికారులు, సిబ్బందికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపి ప్రతిభా పురస్కారాలు అందించారు.



డా.వాగ్దేవి డీసీహెచ్ఎస్ | రామచంద్రరావు, డ్వామా పీడీ | శ్రీనివాసరావు, సివిల్ సప్లయ్ మేనేజర్ | దిలీప్ కిరణ్, ఏఎస్పీ | రాబర్ట్ పాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి | హేమలత, డీఆర్వో | అశుతోష్ శ్రీవాస్తవ సబ్ కలెక్టర్



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న జేసీ శోభిక



పి.వీర్రాజు డీపీవో | ఎన్.తిరుపతిరావు డీఈవో | ఎం.శశికుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి | రాంగోపాల్, సెట్‌విజ్ సీఈవో | జి.శ్రీరామమూర్తి, సూపరింటెండెంట్ | బి.శివజగన్మోహన్, సీసీ, సీడీఎం పేషీ | చిట్టెమ్మ సీసీ టు జేసీ | ఎ.దుర్గా ప్రసాద్ రావు, ఏఏవో | మహేంద్ర కుమార్, జీజీసీ మేనేజర్ | విజయ్‌మోహన్, వైద్యాధికారి, పీపీ యూనిట్ | పల్లా శ్రీధర్, వైద్యాధికారి, మాదలంగి పీహెచ్‌సీ



మనోజ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ | వి.చిట్టిబాబు, జీఎస్‌డబ్ల్యూఎస్ డీసీవో | ఎం.వాసుదేవరావు నాయుడు, పీడీ, డోకిశీల | బి.చక్రధర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ | ఎన్.గౌరీశ్వరి, డీపీఆర్వో సబార్డినేట్ | జి.అనిల్ కుమార్, కలెక్టరేట్ సబార్డినేట్ | ఎస్.నారాయణరావు, సీఈవో, పీఏసీఎస్ | శ్రీను, ఎస్పీ కార్యాలయ పీఆర్వో | పి.రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పార్వతీపురం | లావణ్య, పీసీ, దిశ పోలీస్‌స్టేషన్ | ఎం.మల్లిబాబు, పీసీ, పార్వతీపురంటౌన్ | ఎన్.ఝాన్సీరాణి, లాబ్ టెక్నీషియన్

పార్వతీపురం ఐటీడీఏలో..

పార్వతీపురంజనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం పార్వతీపురం ఐటీడీఏలో ఉత్తమ సేవలు అందజేసిన అధికారులకు పీవో అశుతోష్ శ్రీవాస్తవ అవార్డులతో పాటు ప్రశాంసా పత్రాలు అందజేశారు.



గోపి, దఫే దారుదు | వి.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ | పద్మజ, సీనియర్ అసిస్టెంట్ | జి.గౌరీశంకర్రావు , జూనియర్ అసిస్టెంట్



ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న డిప్యూటీ డీఈవో మోహన్‌రాయుడు

సీతంపేట ఐటీడీఏలో..

సీతంపేట రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కేంద్రంగా నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి 450మంది ఉద్యోగులకు అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.



భానుప్రతాప్, దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి | నారాయుడు, సీనియర్ హెచ్‌ఎం | సతీష్, డీపీవో | అన్నదొర, డీడీ



ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏపీవో చిన్నబాబు

టీడీపీ నేత టెంకాల మృతి

రేగిడి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్నశిర్లాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు టెంకాల గోవిందరావు(78) మృతిచెందారు. ఆయన మృతికి దూబ ధర్మారవు, కిమిడి అశోక్‌కుమార్, టెంకాల అచ్చం నాయుడు, పాలవలస రామచంద్రినాయుడు సంతాపం తెలిపారు.

బాలకృష్ణకు పద్మభూషణ్‌పై హర్షం

లక్కవరపుకోట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణకు కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డు ప్రకటించడంపై ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హర్షం వ్యక్తం చేశారు. ఎల్.కోటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ బాలకృష్ణ చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, మల్లునాయుడు, చంద్రశేఖర్, రాముడు పాల్గొన్నారు.

● రాజాం: పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన నందమూరి బాలకృష్ణకు టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి మరెన్నో పురస్కారాలు అందుకోవాలని కోరారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్

రాజాం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గయ్యన్నవలస ప్రాథమిక పాఠశాలకు విజయనగరం ఐడీబీఐ బ్యాంకు సిబ్బంది రూ.35వేలు విలువైనఆర్వో ప్లాంట్, రెండు బీరువాలు, ర్యాక్‌ను స్కూల్ కమిటీ చైర్మన్ వాజా భాస్కరరావు, సర్పంచ్ సమతం లక్ష్మి చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఐడీబీఐ ఏజీఎంఆర్ ఉమాకాంత్, అసిస్టెంట్ మేనేజరు వజ్జిపత్తి కిశోర్,సమతం రమేష్, పడాల సత్యారావు, లక్ష్మణరావు, సురేష్, చిరంజీవి పాల్గొన్నారు.

అదనంగా దుకాణాలు కేటాయించండి

గజపతినగరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కల్లుగీతకార్మికులకు ప్రభుత్వం పదిశాతం మద్యం దుకాణాలు కేటాయించడం శుభపరిణామమైనా, అదనంగా దుకాణాలను కేటాయించేందుకు ప్రభుత్వం ఆలోచించాలని ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు పురం అప్పారావు కోరారు. ఆదివారం గజపతినగరంలో విలేకరులతో మాట్లాడుతూ నిబంధనల మేరకు జిల్లాకు 15 మద్యం దుకాణాలను కేటాయించారని, అయితే మండలానికి ఒక దుకాణం ఇచ్చేలా ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

యువతి అదృశ్యం

భోగాపురం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలం రెడ్డికంచేరు గ్రామానికి చెందిన యువతి పెంటమాని పద్మ అదృశ్యమైనట్లు ఆమె తండ్రి పెంటమాని పైడయ్య శనివారం రాత్రి ఫజర్యాదు చేశారని ఎస్ఐ వి.పాపారావు ఆదివారం తెలిపారు. పద్మ హైదరాబాద్‌లో పనినిమిత్తం వెళ్లి ఇటీవల ఇంటికి వచ్చిందన్నారు. రెండు రోజులుగా ఆమె కనిపించడం లేదని తెలిపారన్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవం

విజయనగరం కలెక్టరేట్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకాన్ని జేసీ సేతు మాధవన్ ఆవిష్కరించారు. హాజరైన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాస మూర్తి, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

●విజయనగరం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, డీఎస్పీలు యూనివర్స్, వీరకుమార్, ఎం శ్రీనివాసరావు, రాఘవులు, కార్యాలయ ఏవో శ్రీనివాసరావు, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

● జేఎన్‌టీయూలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో వీసీ డి.రాజ్యలక్ష్మి జాతీయ పతాకాన్ని అవిష్కరించారు.



ఏఆర్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

ఉద్యోగులకు అవార్డులు





అవార్డు స్వీకరిస్తున్న ఎస్ఆర్‌వో రమేష్, ఎస్ఏ బంగారురాజు

విజయనగరం దాసన్నపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబెద్కర్ చేతులమీదుగా విజయనగరం ఆర్‌వో కార్యాలయం సబ్ రిజిస్ట్రార్ టి.రమేష్, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడు సీమునురు బంగారురాజులు ఉత్తమ ఉద్యోగులుగా అవార్డు అందుకున్నారు. అలాగే డీఐజీ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న ఉమా కళ్యాణి అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ ఏపీ కుమారిలు, సబ్ రిజిస్ట్రార్లు, ఉద్యోగులు వారికి అభినందనలు తెలిపారు.

మోసగాళ్లను శిక్షించండి: మంత్రి

విజయనగరం క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యోగా టీచర్ల ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను మోసంచేసిన వారిని కఠినంగా శిక్షించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు యోగా టీచర్ల నియామకం పేరిట గత ప్రభుత్వ హయాం నిరుద్యోగ యువకులను బురిడి కొట్టించిందని పేర్కొన్నారు. ఈ మేరకు బాధితులైన నిరుద్యోగులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఆయన నివాసంలో కలిసి, తమకు న్యాయం చేయాలని కోరారు. తక్షణమే స్పందించిన మంత్రి శ్రీనివాస్, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ, ఎస్పీ వకుల్ జిందాల్‌తో ఫోన్లో మాట్లాడారు. దర్యాప్తు జరిపి బాధితులందరికీ న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

శృంగవరపుకోట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పుణ్యగిరి రోడ్డులోని గిరిజన కళాశాల బాలుర వసతిగృహంలో తాగునీటిని సరఫరా, స్నానపు గదులను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నిరసన

విజయనగరం దాసన్నపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం నగరంలోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతంలో విజయదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

చిరు వ్యాపారి ఆత్మహత్య

సంతకవిటి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి); మండలంలో బొద్దూరు గ్రామానికి చెందిన ఓ చిరు వ్యాపారి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న గెంబలి తవిటిరాజు (45)కు వ్యాపారంలోన టష్టం వాటిల్లింది. అప్పులు తీర్చలేక గురువారం మధ్యాహ్నం తమ ఇంటిలో ఉరి వేసుకున్నారు. కుటుంబ సభ్యులు గమనించి రాజాంలోని ఆసుపత్రి తరలించారన్నారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని రిమ్స్ తరించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారని ఎస్ఐ గోపాలరావు వెల్లడించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పురుగు మందు సేవించి మరొకరు..

గుర్ల, జనవరి 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని కెల్ల గ్రామానికి చెందిన పంచాది శివ(30) పురుగు మందు సేవించి మృతిచెందినట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం శివ మద్యానికి బానిస కావడంతో తన భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. దీంతో మనస్థాపం చెందిన ఈ నెల 18న పురుగుల మందు సేవించాడు. ఇది గమనించిన బంధువులు, భార్య స్థానిక సీహెచ్‌సీకి తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం మహరాజా ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్టు తెలిపారు.

అనారోగ్యంతో రెండునెలల శిశువు మృతి

శృంగవరపుకోట రూరల్ జనవరి 26 : మండలంలోని దారపర్తి పంచాయతీ చిలకపాడుకు చెందిన జన్ని విజయ్ (రెండు నెలల 15రోజులు) ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. ఈ విషయంపై బాలుడు కుటుంబసభ్యులు, గిరిజన యువత జరత గౌరిష్ మాట్లాడుతూ బాబుకు అనారోగ్యం చేస్తే విజయనగరం ఘోషా ఆసుపత్రికి గత ఆదివారం స్థానిక ఏఎన్ఎం సహకారంతో తీసుకెళ్లామన్నారు. అయితే వైద్యం తరువాత శనివారం ఇంటికి తీసుకోచ్చాక ఆదివారం సాయంత్రం మరణించాడని వాపోయారు. గతంలో తమ గిరిజన గ్రామాలకు హెల్త్ అసిస్టెంట్ తాతారావు వారంలో నాలుగురోజులు కొండపైకి వచ్చిన బాగోగులు చూసేవాడని, ఆయన ఉద్యోగం పోవడంతో ఆయన స్దానంలో ఎవ్వరు రాలేదని ఆరోపించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

వేపాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన మహిళ అదృశ్యంపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవి తెలిపారు. బొద్దాం గ్రామానికి చెందిన కంచిపాటి వాణి (46) ఐదు అడుగులు ఎత్తు, తెల్లని ఛాయ, గుండ్రని ముఖం, గోధుమ రంగు చీర జాకెట్‌తో ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

- ఘనంగా గణతంత్ర దినోత్సవం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అధికారులు
- ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర దినోత్సవాన్ని పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అనేక మంది స్వాతంత్ర సమర యోధుల త్యాగ ఫలితమే ఈనాడు ఈ గణతంత్ర దినోత్సవమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.వివిధ శాఖల ఉన్నతాధికారులు, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


కురుపాం: టీడీపీ కార్యాలయం వద్ద గణతంత్ర దినోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి


సీతంపేట రూరల్: ఇండోర్ స్టేడియం ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి


బెలగాం: జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి


పార్వతీపురం రూరల్: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న డీఎఫ్‌వో ప్రసూన


పార్వతీపురం: జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు


కురుపాం రూరల్: జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న న్యాయాధికారిణి సౌమ్యా జోస్పిన్


పార్వతీపురం: కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జేసీ శోభిక


సీతంపేట రూరల్: దేశభక్తి గీతానికి నృత్యం చేస్తున్న మినీ గురుకులం చిన్నారులు


పార్వతీపురం: జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ


పాలకొండ: కోర్టు ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణలో జూనియర్ సివిల్ న్యాయాధికారి విజయరాజ్‌కుమార్

గణతంత్ర వేడుకల్లో జిల్లా రైతు

కొమరాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిలో ఢిల్లీలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకలకు పార్వతీపురం మన్య జిల్లా కొమరాడ మండలం గుణానపురం గ్రామానికి చెందిన రైతు పైలా గణపతి హాజరయ్యారు. బిందు సేద్యం ద్వారా ఉద్యాన పంటలు పండించినందుకు గాను ఆ శాఖ అధికారులు.. గణపతిని ఎంపిక చేసి, ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకలను వీక్షించేందుకు తీసుకు వెళ్లారు. గణతంత్ర వేడుకలను ప్రత్యక్షంగా చూసినం దుకు తన జన్మ ధన్యమైనట్లు గణపతి తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే పరిశ్రమలు

- కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం,జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వంలో పరిశ్రమలు వస్తున్నాయని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావే శంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశ్రమల ఏర్పాటు కోసం దావోస్ వెళ్లి అంతర్జాతీయ జాతీయ పారిశ్రామికవేత్తలతో మాట్లాడి లక్ష కోట్లకు పైగా విలువైన పరిశ్రమలను తీసుకొచ్చారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపనకు ఎవరూ ముందుకు రాలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు వల్ల 20 లక్షల మంది యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కూడా పరిశ్రమల ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

నేడు కురుపాంలో జాబ్ మేళా

కురుపాం, జనవరి26(ఆంధ్రజ్యోతి): కురుపాంలో సోమవారం నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగులు వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. ఆదివారం ఆమె కురుపాంలో విలేకర్లతో మాట్లాడారు. సోమవారం కురుపాం జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాకు 20 ప్రైవేటు కంపెనీ ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన నిరుద్యోగులు పాల్గొనవచ్చని తెలిపారు. తెలుగు యువత అధికారి అధికార ప్రతినిధి, మాజీ ఏఎంసీ చైర్మన్ కోలా రంజిత్‌కుమార్, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి కద్రక మల్లేశ్వరరావు, టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య పాల్గొన్నారు.

గిరిజన రైతులకు స్ప్రింక్లర్ యూనిట్లు

పార్వతీపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సూక్ష్మ నీటి పారుదల సంస్థ ఐటీడీఏ భాగస్వామ్యంతో కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో పది మంది గిరిజన రైతులకు రూ.10.05లక్షల విలువ ఉన్న బిందు, తుంపర్ల సేద్య పరికరాలను ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ ఆదివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పంపిణీ చేశారు. 1,800 హెక్టార్ల విస్తీర్ణంలో డ్రిప్, స్ప్రింక్లర్ యూనిట్లు కలిగిన వాహనానికి పీవో జెండా ఊపి ప్రారంభించారు. ఏపీఎంఐపీ, ఐటీడీఏ సౌజన్యంతో ఈ పథకం కింద 750 స్ప్రింక్లర్ యూనిట్లను రాయితీపై గిరిజన రైతులకు పంపిణీ చేయనున్నారు.

శంబరలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

మక్కువ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ జాతర నేపథ్యంలో శంబర గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేశారు. వివిధ మేజర్ పంచాయతీల నుంచి వచ్చిన పారిశుధ్య సిబ్బంది గ్రామంలోని వ్యర్థాలను తొలగించారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. చదురుగుడి, వనంగుడి పరిసరాల వద్ద పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు.

పైపులైన్లకు మరమ్మతులు

మక్కువ సమగ్ర రక్షిత మంచినీటి పథకం వద్ద పైపులైన్లకు ఆదివారం మరమ్మతులు నిర్వహించారు. గత నాలుగు రోజులుగా మక్కువ గ్రామానికి తాగునీరు నిలిచిపోవడంతో పైపులైన్లను పరిశీలించారు. శంబర జాతర సందర్భంగా నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నారు. మరోవైపు కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా నిలిచిపోవడంతో మహిళలు సువర్ణముఖి నది వద్దకు వెళ్లి చలమల నీరు పట్టుకున్నారు. టీడీపీ నాయకుడు దాసరి కేశవరావు, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవం

ఒడిశా

రాయగడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమర యోధుల త్యాగ ఫలితమే గణతంత్ర రాజ్యాంగమని రాష్ట్ర కుటుంబ సంక్షేమ ఐటీ శాఖా మంత్రి ముఖేష్ మహాలింగ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక జీసీడీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జాతీయ పతాకావిష్కరణ చేసి, పోలీసు దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో కలెక్టర్ పారుల్ పట్వారి, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.


జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి ముఖేష్, కలెక్టర్ పారుల్, ఎస్పీ స్వాతి

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

- మంత్రి సంధ్యారాణి

సాలూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గణతంత్ర దినోత్సవంలో భాగంగా ఆదివారం ఆమె సాలూరులోని మహాత్మా జ్యోతీరావు పూలే వెనుకబడిన తరగతుల బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఎండీఎం ఆహార పదార్థాలను పరిశీలించి, రుచి చూశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. సెల్‌ఫోన్‌లను అవసరమైన మేరకే ఉపయోగించాలని బాలికలకు సూచించారు. త్వరలోనే పాఠశాలకు స్థలాన్ని మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, బలగ శ్రీను, పరమేష్, హర్షవర్థన్, ప్రిన్సిపాల్ మూకల పెంటయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.


వంటకాలను పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి

రైతు వ్యతిరేక విధానాలు తగవు


ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

పాలకొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏపీ రైతు కార్మిక సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పాలకొండ కోటదుర్గమ్మ అమ్మవారి ఆలయ జంక్షన్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీ రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎం.తిరుపతిరావు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సంబంధించిన నూతన చట్టాలను రద్దు చేయాలన్నారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించి ఐక్య పోరాటాలు తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు చిట్టిబాబు, జి.కృష్ణ, ఎం.అప్పన్న, కె.రాము, డి.దుర్గారావు, వీరన్నాయుడు, భానుచందర్, శ్రీనివాసరావు, సంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డును అభివృద్ధి చేయరూ..

- విరిగి పడుతున్న కొండ చరియలు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న గిరిజనులు

కురుపాం రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నీలకంఠాపురం- జరడ గ్రామాల మధ్యలో గల తొమ్మిది కిలోమీటర్ల ఘాట్ రోడ్డులో నిత్యం ప్రజలు ఇబ్బందులతో రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో రెండు సార్లు కొండ చరియలు విరిగిపడి రోడ్డు మూసుకుపోయింది. కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి స్వయంగా పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన రహదారిపై రాళ్లను తొలగింపజేశారు. ఆ తర్వాత మరోసారి కొండ చరియలు విరిగి పడ్డాయి. ఈ మార్గంలో లోయవైపు రిటైనింగ్ గోడలు నిర్మించి కొండవైపు తగ జాగ్రత్తలు తీసుకుంటే కొండచరియల బారి నుంచి ప్రజలకు కాపాడవచ్చు. ప్రస్తుతం జరడ రోడ్డు పూర్తిగా పాడయ్యింది. పదుల సంఖ్యలో గ్రామాల వారు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తి స్థాయిలో జరడ రహదారిపై దృష్టి సారిం చాలని ఆ గ్రామ సర్పంచ్ ఊయక జ్యోతి కోరారు.


ఇదీ జరడ రహదారి పరిస్థితి

నాలుగు లైన్ల రోడ్డుకు డీపీఆర్: ఎంపీ కలిశెట్టి

రామభద్రపురం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం జంక్షన్ నుంచి రాజాం, రామభద్రపురం మీదుగా కొమరాడ మండలంలోని రావాడ రామభద్రపురం వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మించడానికి డీపీఆర్ సిద్ధమైనట్లు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం రామభద్రపురం బైపాస్ రోడ్డు వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ రహదారి వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కారితో చర్చించి హైవే నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఇప్పటికే దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి హైవే అధికారులకు ఫీజిబులిటీ వచ్చిందని, వచ్చే ఏడాది బడ్జెట్‌లో నిధులు విడుదల కానున్నాయని తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు మన్యంలో ట్రైకార్ చైర్మన్ పర్యటన

సీతంపేట రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు సోమవారం పర్యటించనున్నట్టు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐటీడీఏ పరిధిలోని సెక్టోరియల్ అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం పలు గిరిజన గ్రామాల్లో పర్యటిస్తారని చెప్పారు. ఈ పర్యటనలో ట్రైకార్ చైర్మన్‌తో పాటు ముగ్గురు డైరెక్టర్‌లు కూడా ఉన్నారని తెలిపారు. సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

సాలూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కురుకూటి మాజీ సర్పంచ్ ముువ్వల అప్పారావు మృతికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సంతాపం తెలిపారు. ఆదివారం అప్పారావు మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న మంత్రి.. ఆయన స్వగ్రామం సొంపిగాం వెళ్లారు. భౌతికకాయానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు ఉన్నారు.

రేపు దివ్యాంగ పింఛన్ల తనిఖీ

జియ్యమ్మవలస, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏరియా ఆసుపత్రిలో ఈనెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 4 వరకు వినికిడి లోపం ఉన్న పింఛన్‌దారుల తనిఖీ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 28న కుదమ, 29న కన్నపుదొరవలస, చినమేరంగి, గవరమ్మపేట, జియ్యమ్మవలస, శిఖబడి, పరజపాడు పంచాయతీలకు సంబంధించిన వినికిడి లోపం ఉన్న పింఛన్‌దారులు హాజరు కావాలన్నారు. 3వ తేదీన ఎం.అల్లువాడ, డంగభద్ర, బీజే పురం, టీఎస్ వలస, గెడ్డతిరువాడ, చింతలబెలగాం, ఇటిక, టీకే జమ్ము పంచాయతీలు, 4న మిగిలిన పంచాయతీల్లో ఉన్న వినికిడి లోపంతో పింఛన్లు పొందిన వికలాంగులు వెళ్లి పరీక్ష చేయించుకొని రావాలని ఆయన కోరారు. మండలంలో వినికిడి లోపం ఉన్న వికలాంగుల పింఛన్లు 201 ఉన్నాయన్నారు.